కథానిక:

# అబల

★

శ్రీ వేలూరి సహజానందం

"విన్నారా?"

"........."

"మిమ్మల్నే."

"ఏమిటి?" అన్నాడు భోజనంలో నిమగ్నుడైన భర్త, తలెత్తి.

"ఏమి టేమిటి? విన్నారా అంటే?"

"ఏమిటి వినటం?" అర్థంకాక తెల్లపోయి అతనామెకేసి చూశాడు. ఆ తెలివితక్కువ చూపు ఉందే, ఆ చూపు తను కాపురానికి వచ్చినప్పటి నుంచీ చూస్తోంది. అబ్బ! ఆ చూపు చూస్తేనే చాలు మనిషిమీద అసహ్యం పుట్టుకురావటానికి. ఆమెకు మామూలుకన్న కూడా ఈసారి ధర్మపతిపై అసహ్యం ఎక్కువ కలిగింది.

ఊరంతా ఇంత ముఖ్యాతి ముఖ్యమైన విషయంతో అట్టుడికిపోతుంటే, నిమ్మకు నీరెత్తినట్టు తింటూ కూర్చుంటాడేం ఈ పెద్దమనిషి...

"మీది మరీ అడివిగోడుఅండీ" అంది నవ్వుతూ.

ఎంత వ్యతిరేక భావాలైనా చక్కని సరసంలో మూసపోసి, ముసిముసినవ్వులు నవ్వటం ఆమెకీ అయిదేళ్ళలో మొదట్లో కష్టంగా, తర్వాత సులభంగా అలవాటైపోయింది.

"సరేలే...నా అడివిగోడు ఎప్పుడూ ఉన్నదేగా...

"అసలు విషయమేమిటో చెప్పు" అన్నాడతను, అన్నం అరగిస్తూ.

"పచ్చడి ఎలా ఉంది?"

"బాగానే ఉంది."

........................

"కారం ఎక్కువైందా......ఉప్పు తక్కువైందా..."

"ఏమో అదంతా నాకు తెలియదు...బాగానే ఉంది."

"మరి ఏం తెలుసు?..." అని మళ్లీ చేదు మందుకు పంచదార పూతలాంటి ఆ సరసపు నవ్వు నవ్వి, ఉపక్రమించింది.

"శంకరంగారి కోడలు మేనత్తకూతురు వచ్చింది ఊరికి" అంది గంభీరంగా, కూర వడ్డిస్తూ.

"ఆ!" అన్నాడతను. ఇంకా అతనిచూపు అలాగే ఉంది.

"ఆవిడండీ...ఆవిడ...ఉచ్చరించటానికికూడా మహా పాపం..."

"ఆ...విడా."

"ఊఁ...ఆ...మొగుడిని విడిచిపెట్టి తిరుగుతోందే...ఆవిడ."

"ఊ...ఎప్పుడు?"

"ఎప్పుడు వస్తేం...అలాంటి గ్రహం ఈ ఊర్లో కాలుపెట్టాక. శంకరంగారు ఏ లోకంలో ఉన్నాడో ధర్మరాజు...ఎంత కుమిలిపోతున్నాడో...సదాచార సంపన్నుని ఇంట్లో..." అని ఆమె వడ్డిస్తున్న పులుసుగరిటె నలాగే మధ్యలో ఆపి, భర్త ముఖంలోకి చూసింది.

తడీపొడిగా ఉన్న పులుసు అన్నంమీదే ఉంది అతని చూపంతా.

"ఊఁ...వడ్డించు" అన్నాడతను.

"సరే ... వడ్డించటానికి కాదూ నేఉంది... పట్టండి" అని గిన్నెతోనే వడ్డించింది.

ధర్మాధర్మాలకు, పాపపుణ్యాలకు, నీతి అవినీతులకు సంబంధించిన మహా సమస్యగురించి తను చెప్తుంటే, ఏమీ కుతూహలం చూపక, కేవలం శాకపాకాలతోనే సతమత మవుతున్నాడు.

